క్లుప్తంగా

5న వైఎస్సార్ సీపీ శ్రేణుల నియోజకవర్గ స్థాయి సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత సమావేశం ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ఆర్ కన్వెన్షన్ హాల్లో జరుగుతుందని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్టు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల కమిటీల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ప్రైవేట్ పాఠశాలలు నేడు బంద్



తాళ్లపూడి ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు

తాళ్లపూడి: ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ పిలుపు మేరకు మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు గురువారం బంద్ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లపూడి ఎంఈవో సీహెచ్ బాలామణికి వినతిపత్రం అందజేసారు. పాఠశాల విద్యాశాఖలో కొందరు అధికారులు ఏకపక్ష నిర్ణయాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగా బంద్ నిర్వహిస్తున్నట్టు తాళ్లపూడి మండల ప్రైట్ స్కూల్ కరస్పాండెంట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీ అనీష్, జేవీ ప్రమోద్‌కుమార్, ఎం సీత, సుబ్బారావు, సుబ్రహ్మణ్యంలున్నారు.

పలు గ్రామాల్లో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు రూరల్: విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా ఈనెల 4 తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. తాడిమళ్ల, కోరుమామిడి, బసివిరెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శెట్టిపేట, తాళ్లపాలెం, సమిశ్రగూడెం, అట్లపాడు, కోరుమామిడి, అమ్మేపల్లి, తాడిమళ్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

134 మందికి కంటి వైద్య పరీక్షలు



సమిశ్రగూడెంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిడదవోలు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు అన్నారు. సమిశ్రగూడెం గీతామందిరంలో తిమ్మరాజుపాలెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్సై బాలాజీ సుందరరావు ప్రారంభించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల బృందం 134 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ బండి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు బండి అరుణకుమారి, కార్యదర్శి ఎస్‌వీవీఎస్ రామచంద్రరావు, రీజనల్ చైర్మన్ గౌరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

స్కూళ్లు, కళాశాలల బస్సుల తనిఖీ

చాగల్లు: కొవ్వూరు నుంచి నిడదవోలు రోడ్డులో మద్దూరు వంతెన వద్ద బుధవారం రవాణా శాఖాధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల బస్సుల్లో అటెండెంట్ లేకపోవడం, అగ్నిమాపక యంత్రాలు లేకపోవడం, లైసెన్సులు లేకపోవడంపై ఎనిమిది కేసులు నమోదు చేసి రూ.84,300 అపరాధ రుసుం విధించినట్టు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ శివప్రసాద్ తెలిపారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.లక్ష్మీప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

నిడదవోలు: స్వయం సహాయక సంఘాల సభ్యులకు త్వరితగతిన సేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఏ.జ్యోతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా మురళి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మెకానికల్ హెడ్ ఆకుల మురళి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వి.నాగేశ్వరరావు గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే.

ప్రచార ఆర్భాటం.. ఆచరణలో విఫలం

- కార్పొరేషన్ రుణాల కోసం ప్రజల ఎదురుచూపు
- ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం
- బీసీలకు ఇంటర్వ్యూలు ముగిసినా మంజూరుకాని రుణం
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణ
- నిడదవోలు మండలంలో 79 యూనిట్లకు 1,249 మంది దరఖాస్తు



సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు, బ్యాంకర్లు (ఫైల్)



బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు (ఫైల్)

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ప్రచార ఆర్భాటమే తప్ప ఏ ఒక్కటి సక్రమంగా అమలుచేసిన దాఖలాలు లేవు. సూపర్ సిక్స్ పథకాల పరిస్థితి అలా ఉంచితే.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు మంజూరు పేరుతో హడావుడి చేశారు. క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపు దాల్చలేదు. కారణాలు ఏమైనా బీసీ కార్పొరేషన్ మంజూరు ఉత్తుత్తి ప్రచారంగా మిగిలిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడదవోలు నియోజకవర్గంలో ఎంతో ఆర్భాటంగా నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల స్వీకరణ, ఏప్రిల్ 4,5 తేదీల్లో హడావుడిగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. నేటికీ ఒక్కరికీ రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ తీరుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. రుణాలంటూ హడావిడి చేసి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభ్యర్థుల ఆశపై నీళ్లు చల్లినట్టేనా..

ఎంతో ఆర్భాటంగా ప్రభుత్వ ప్రచారం చేసి దరఖాస్తుదారులకు సబ్సిడీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు హుళక్కేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు ప్రక్రియ ముగిసిన తర్వాత కొద్దిరోజులకే మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది అర్హుల జాబితా సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపించారు. లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ జమ అయితే కానీ రుణాలు మంజూరు చేయని పరిస్థితిలో బ్యాంకర్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మూడు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకులు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిధులు లేని కారణంగానే ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం పాలనలో కార్పొరేషన్ రుణాల మంజూరు నీటి మీద రాతలా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అర్హుల జాబితా బ్యాంకులకు పంపించాం

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేశాం. అన్ని బ్యాంకులకు ఈ జాబితాను పంపించి మా ప్రక్రియను పూర్తి చేశాం. రుణాలు మంజూరు చేయాల్సిన బాధ్యత బాంకర్లపై ఉంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

– వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, ఎంపీడీఓ, నిడదవోలు

ఎన్నాళ్లీ నిరీక్షణ ?

నిడదవోలు మండలంలోని 23 గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులకు 10 బ్యాంకుల పరిధిలో 79 యూనిట్లు మంజూరు కాగా 1,249 మంది బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గోపవరం, పురుషోత్తపల్లి, విజ్జేశ్వరం, పందలపర్రు గ్రామాలకు చెందిన 251 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా కేవలం 12 యూనిట్లు మంజూరు చేసేందుకు చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంక్ (పురుషోత్తపల్లి) ముందుకొచ్చింది. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు కేటాయింపు ఉంటుంది. అందులో బ్యాంకర్ల వాటా సగం, ప్రభుత్వ సబ్సిడీ వాటా సగం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల కోసం లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. యూనిట్లు మంజూరు కేటాయింపులు తక్కువ ఉండటంతో ఇంటర్వ్యూలు నిర్వహించకుండానే ప్రభుత్వం ఈ ప్రక్రియ నిలిపివేసింది. నిడదవోలు మండలంలో 112 యూనిట్లకు 255 మంది వరకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల సిఫార్సులు ఉన్నవారికే రుణాలు ఇస్తారన్న కారణంగా కొందరు అభ్యర్థులు రుణాలపై ఆశలు వదులుకున్నారు. మరికొందరు ఇంటర్వ్యూలు ముగిసినప్పటి నుంచి తమకు సబ్సిడీ రుణాలు ఎప్పుడు వస్తాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలపై ఏకపక్ష నిర్ణయాలు తగవు



నల్లజర్లలో మండల విద్యాశాఖ అధికారికి మెమోరాండం అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు

దేవరపల్లి: ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష చర్యలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, నల్లజర్ల సంఘమిత్ర విద్యాలయ కరస్పాండెంట్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలను మూసివేస్తున్నట్టు ఆయన తెలిపారు. బుధవారం నల్లజర్లలో అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశమైన ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు ప్రభుత్వ విధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు అంబట శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలపై కొంత మంది అధికారులు దురుసు చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగం ఉలిక్కిపడుతోందన్నారు. జిల్లాలో త్రీమెన్ కమిటీల తనిఖీలు, షోకాజ్ నోటీసులు, పాఠశాలల గుర్తింపు రద్దు వంటి బెదిరింపు చర్యలు యాజమాన్యాలను తీవ్రంగా కలతకు గురిచేస్తోందన్నారు. 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఏకపక్షమైన నిర్ణయాలను నివారించి సూత్రీకరణ విధానాల ప్రకారం సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వై. సత్యనారాయణకు గురువారం ప్రైవేట్ పాఠశాలలను మూసివేస్తున్నట్టు వినతిపత్రం అందజేసినట్టు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సలహాదారుడు ఉషోదయ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ ఎంఎస్ చల్లారావు, రుషి మోడల్ స్కూల్ కరస్పాండెంట్ వై. రామారావు, వివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూలు కరస్పాండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కెనరా బ్యాంక్ ఆర్థిక సహకారం



సూర్యారావుపాలెంలో స్థానిక ప్రజాప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న కెనరా బ్యాంక్ ప్రతినిధులు

ఉండ్రాజవరం: గ్రామం అభివృద్ధికి కెనరా బ్యాంక్ ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని మెండే లలితకుమారి అన్నారు. సూర్యారావుపాలెంలో బుధవారం కెనరా బ్యాంక్ ప్రతినిధులు పర్యటించి, రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ మెండే లలితకుమారి, వైస్ సర్పంచ్ నందిన శ్రీనివాస్‌కు అందజేశారు. బ్యాంక్ స్థాపించి 120 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దత్తత గ్రామమైన సూర్యారావుపాలెంకు ఈ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సహకారంతో పాఠశాలల్లో భోజనం షెడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ భీమవరం రీజనల్ డీజీఎం మాధవరావు మద్దు, ఏజీఎం బొడ్డాగాల పవన్ కుమార్, నిట్ ఏపీ తాడేపల్లిగూడెం డైరక్టర్, రిజిస్టర్ దినేష్ శంకర్ రెడ్డి, తాడేపల్లిగూడెం బ్రాంచ్ మేనేజర్ డి.రాజేంద్రప్రసాద్, గ్రామ పెద్దలు ఆర్ ధనం, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కోడూరి లక్ష్మణరావు, మెండే శ్రీనివాసు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పంటల బీమాతో ప్రయోజనం



సత్యవాడలో నారుమడులను రైతులతో పరిశీలిస్తున్న ఏవో రాజారావు

ఉండ్రాజవరం: రైతులు విధిగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు తెలిపారు. మండలంలో కాల్దారి, సత్యవాడలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సత్యవాడలో వేసిన నారుమడులను ఆయన పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్షల ప్రాధాన్యతను, భూసారాన్ని పెంపొందించడానికి పచ్చిరొట్ట పైరు పెంపకం ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాశీ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్ సమస్య పరిష్కారం



సింగరాజుపాలెంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యను పరిష్కరించిన జీఎం శ్రీనివాస్, అధికారులు

దేవరపల్లి: ఎంతో కాలంగా సిగ్నల్ సమస్యతో ఇబ్బంది పడుతున్న నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామ ప్రజల సమస్యను అధికారులు పరిష్కరించి 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ సిగ్నల్ సరిగా పనిచేయక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వైఎస్సార్ సీపీ నాయకురాలు, ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీ, పరమేశ్వరరావు దంపతులు సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మంగళవారం విజయవాడలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజరు ఎల్. శ్రీనును కలిసి సమస్యను వివరించి పరిష్కరించాలని విపతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జీఎం శ్రీను బుధవారం దిగువస్థాయి అధికారులు, సాంకేతిక సిబ్బందిని వెంటబెట్టుకుని గ్రామానికి వచ్చారు. సిగ్నల్ సమస్యను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిగ్నల్ సమస్యను సరిచేసి 4జీ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. సమస్యను తక్షణం పరిష్కరించిన అధికారులకు ఎంపీటీసీ సభ్యురాలు పావని, పరమేశ్వరరావు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం సొమ్ము కోసం ఎదురుచూపు

- కొనుగోలు చేసి రెండు నెలలైనా నేటికీ అందని డబ్బు
- నియోజకవర్గంలోని రైతులకు రూ.47 కోట్ల బకాయిలు
- ఖరీఫ్ సాగుకు పెట్టుబడి లేక రైతుల అవస్థ



కానూరులో ధాన్యం బాస్తాలను లారీపై ఎగుమతి చేస్తున్న కూలీలు (ఫైల్)

పెరవలి: రబీ రైతుల పరిస్థితి ముందు చూస్తే నుయ్యి వెనుక చూస్తే గొయ్యి అన్న చందంగా ఉంది. ఒక వైపు తరుముకు వస్తున్న ఖరీఫ్ సాగు పనులు, మరో వైపు రబీలో ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యానికి సొమ్ము అందక నానాపాట్లు పడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి చేతులు దులుపుకోవడంతో రైతులు సొమ్ము కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపు చూస్తోందని వారు ధ్వజమెత్తుతున్నారు. ధాన్యం విక్రయించి రెండు నెలలవుతున్నా సొమ్ము జమ చేయడంలో తాత్సారం ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మే 2వ తేదీ వరకు మాత్రమే ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ము అందాయని ఆ తరువాత కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ము నేటికీ జమ కాలేదన్నారు.

అప్పుల బాధలో అన్నదాత

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్ పంట పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు సాగుకి సన్నద్ధవుతున్నారు. కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా మోసపోతూనే ఉన్నామని రైతులు వాపోతున్నారు. రబీలో పండించిన పంటను కొనుగోలు చేసి నేటికీ సొమ్ము ఇవ్వక పోతే ఎలా బతికేదని వారు నిలదీస్తున్నారు.

రోడ్డుకెక్కిన అన్నదాతలు

రబీలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన అన్నదాతలు వాటికి సంబంధించిన సొమ్ము కోసం కూడా రోడ్డెక్కి ఆందోళన చేసినా న్యాయం జరగడం లేదు. మే 1న పెరవలిలో జాతీయ రహదారిని, మే 3న నిడదవోలులో ఆర్ అండ్‌బీ రహదారిని, మే 14న ఉండ్రాజవరంలో ధాన్యం కొనుగోలు కోసం రైతులు ఆందోళనలు చేసారు. ఆ తరువాత ధాన్యం సొమ్ము కోసం మే 24న కానూరులో, జూన్ 8న నిడదవోలులో, జూన్ 14న ఉండ్రాజవరం మండలంలో రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు.

నిడదవోలు నియోజకవర్గంలో రూ.47 కోట్ల బకాయిలు

నిడదవోలు నియోజకవర్గంలో రూ.47 కోట్ల వరకూ ధాన్యం సొమ్ము రైతులకు అందవలసి ఉంది. ఉండ్రాజవరం మండలంలో రూ.34 కోట్లు, నిడదవోలు మండలంలో రూ.12 కోట్లు, పెరవలి మండలం రూ.కోటి ధాన్యం సొమ్ము ప్రభుత్వం నుంచి రైతులకు రావాల్సి ఉంది. ధాన్యం సొమ్ము అందక గత పంట కాలంలో సాగుకు చేసిన చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని, వచ్చే ఖరీఫ్ పంటకు పెట్టుబడి లేక ఇబ్బందులు పడుతున్నాని రైతులు వాపోతున్నారు.

అప్పలకు పెరుగుతున్న వడ్డీలు

ఒక ఎకరం పంట ధాన్యం ఏప్రిల్ 29న విక్రయించాను. నేటికీ సొమ్ము జమ కాలేదు. అధికారులను అడుగుతుంటే ఇదిగో, అదుగో అంటూ తాత్సారం చేస్తున్నారు. సొమ్ములు ఎప్పటికి జమ అవుతాయో తెలియడం లేదు. చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి.

– జుత్తుగ రంగయ్య, వరి రైతు, ముక్కామల

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కితేగాని అధికారులు స్పందించ లేదు. ఇప్పుడు ధాన్యం సొమ్ము కోసం రోడ్డు ఎక్కాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం రైతులను సమస్యల్లోకి నెడుతోంది. పాలకులు రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. నాయకులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

– ముళ్లపూడి వెంకటేశ్వరావు, రైతు, ముక్కామల


ఆయిల్‌పామ్ గెలల లారీ బోల్తా



కొత్తగూడెం వద్ద బోల్తాపడిన ఆయిల్‌పామ్ గెలల లారీ

దేవరపల్లి: నల్లజర్ల మండలం కొత్తగూడెం వద్ద ఆయిల్‌పామ్ గెలల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బుధవారం బోల్తా పడింది. వర్షాలకు రోడ్డు మార్జిన్ జారడంతో 25 టన్నుల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి మార్జిన్‌లో బోల్తా పడినట్టు స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ రహదారిలో నిత్యం ద్వారకాతిరుమలకు పాదయాత్రగా భక్తులు వెళుతుంటారు. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ముత్యాలమ్మకు బంగారు నేత్రాల అలంకరణ



ఉండ్రాజవరంలో ముత్యాలమ్మవారికి బంగారు నేత్రాల అలంకరణ

ఉండ్రాజవరం: గ్రామ దేవత ముత్యాలమ్మవారికి బంగారు నేత్రాలను (బంగారపు కనుబొమ్మలను) దాతలు బుధవారం అందజేశారు. దాతలు కడలి వెంకటలక్ష్మి కుమారుడు కడలి దుర్గాభవానీ శంకర్, భార్య ప్రవల్లిక, మనవడు అధరమ్ ఆర్థిక సహకారంతో బంగారు నేత్రాలను అమ్మవారికి సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం బంగారు నేత్రాలను అమ్మవారికి అలంకరించారు.

మర్యాదపూర్వక భేటీ



తాడేపల్లిలో బుధవారం రాష్ట్రస్థాయి జిల్లా యువజన విభాగాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశం అనంతరం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తూర్పుగోదావరి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. – తాళ్లపూడి(కొవ్వూరు)

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



తాళ్లపూడిలో సమావేశమైన జట్టు కార్మికులు

తాళ్లపూడి: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కోరుతూ జులై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏం సుందర్‌బాబు కోరారు. బుధవారం స్థానిక సాయిబాబా ఆలయం వద్ద మండపంలో రైస్ మిల్ హమాలీ కార్మికులలో సమ్మె ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు రైతులు సమ్మెలోకి దిగుతున్నారని తెలిపారు. హక్కుల సాధనకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు ఘన నివాళి

నిడదవోలు రూరల్: బీజేపీ బలోపేతానికి పార్టీ సీనియర్ నాయకులు మాట్ల వెంకటేశ్వరరావు ఎనలేని కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. సమిశ్రగూడెంలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో నిడదవోలు నియోజకవర్గ బీజేపీ నాయకులు బుధవారం సంతాప సభ నిర్వహించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పిక్కి నాగేంద్ర, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు చింతల బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

నిడదవోలు రూరల్: కంసాలిపాలెం-మాధవరం వంతెన వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. కంసాలిపాలెంలో కూలిన బ్రిడ్జి ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వంతెన వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణలో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని రాంబాబు విమర్శించారు.

కాలువలకు నేడు నీటి విడుదల

దేవరపల్లి: తాడిపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం కుడి ప్రధాన కాలువలకు గురువారం నీరు విడుదల చేస్తున్నట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపినట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. రైతులు, పశువులు ఉదయం నుంచి కాలువల్లోకి దిగరాదని ఆయన తెలిపారు. గ్రామాల్లోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఏఏలు, వీహెచ్‌ఏలు, వెటర్నరీ అసిస్టెంట్లు రైతులు, పశువుల కాపరులను అప్రమత్తం చేయాలని ఆయన తెలిపారు.